క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. కట్టమంచి, కొంగారెడ్డిపల్లె, ఆఫీసర్ లైన్, మురగానిపల్లె, సాంబయ్యకండ్రిగ, కామేశ్వర్‌నగర్, విజయనగర్ కాలనీ, నీమ్ గార్డెన్, మల్లికార్జున కాలనీ, బీవీరెడ్డి కాలనీ, మహదేవనాయుడు కాలనీ, గురునగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాలని కోరారు.

యూటీఎఫ్ నూతన డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్: యూటీఎఫ్ డైరీని జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరింపజేశారు. ఏపీసీ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల పెంపు కోసం టీచర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పటిష్ట ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర నాయుడు, మణిగండన్ పాల్గొన్నారు.

రామారావుకు ఘన నివాళి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

బంగారుపాళెం: స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రజా సంక్షేమానికి పాటుపడ్డారని ఎమ్మెల్యే మురళీమోహన్ కొనియాడారు. మండల కేంద్రంలో శనివారం టీడీపీ మండల అధ్యక్షులు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కార్యకర్తలు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు జనార్దన్‌గౌడ్, జయచంద్రనాయుడు, మహేంద్ర, లోకనాథనాయుడు, హేమచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఈచనేరిలో ఫ్యామిలీ డాక్టర్


వైద్యం అందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 37 మందికి వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, బాలింతలకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంటింటికి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ అక్షరాస్యతే లక్ష్యం


సామగ్రి అందజేస్తున్న డీడీ

గుడిపాల: ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా మహిళా సంఘాల్లో ఎవరైనా నిరక్షరాస్యులున్నట్లయితే వారిని గుర్తించాలన్నారు. గుర్తించిన వారందరికీ జనవరి 20వ తేదీ నుంచి చదువు నేర్పించాలన్నారు. వారికి తోడ్పడేలా చెప్పాలన్నారు. ఇందుకు ఆయా గ్రామాల్లో ఉన్న సంఘమిత్రలు కీలకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం వాటికి సంబంధించిన మెటీరియల్‌ను ఏపీఎం సుధారాణికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజన్, వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, సహదేవ్ పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

పుంగనూరు: మండలంలోని పత్రపల్లితాండకు చెందిన రమణానాయక్‌ను అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సారా వ్యాపారాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా రమణానాయక్‌ను అరెస్టు చేశామన్నారు. అలాగే పాత కేసుల్లో నిందితులైన నరసింహరాజు, రత్నమ్మ, రమేష్‌ను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించామన్నారు. సారా విక్రయిస్తున్న రమణానాయక్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

కోతలా.. సర్వేశ్వరా!

పథకాల్లో కోతలు విధించేందుకు సర్కారు సర్వేలకు తెరతీసింది. ఇప్పటికే 16 రకాల సర్వేలతో సచివాలయ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. దీనికితోడు అదనపు పనులు అంటగట్టేశారు. మరోవైపు కూటమి వర్గపోరుతో ఉద్యోగులు ప్రజా సేవను గాలికొదిలేశారు. సమస్యల పరిష్కారం కోసం జనం ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయాల్లో సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఇక సర్వేపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో అర్హులను కుదించేందుకే ఈసర్వే చేపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

- మూడు నెలలుగా 16 రకాల ప్రభుత్వ సర్వేలు
- సర్వేల్లో చిక్కుకున్న సచివాలయ సిబ్బంది
- సర్వేపై వెల్లువెత్తుతున్న అనుమానాలు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయంపై కత్తికట్టింది. వ్యవస్థను దారి మళ్లించాలని కుట్రపన్నుతోంది. పల్లె పాలనను రద్దు చేయాలని యత్నిస్తోంది. సర్వేల పేరుతో వారిని వేధింపులకు గురి చేస్తోంది. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 175 సచివాలయాల్లో 1560 మంది వరకు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో 1,69,236 కుటుంబాలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కుటుంబాల సర్వేను ప్రారంభించింది. అలా మొదలైన ఒక్క సర్వే.. ఇప్పుడు 16 రకాలకు పాకింది.

సర్వేలు ఇలా...

గత ప్రభుత్వంలో అవసరమైనంత వరకు మాత్రమే సర్వేలు జరిగేవి. పరిస్థితులకు అనుగుణంగా సర్వే చేసేవారు. వలంటీర్ల సాయంతో సచివాలయ సిబ్బంది రోజుల వ్యవధిలో సర్వేలను చకచకా చేసేవారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలల్లోనే పదుల సంఖ్యలో సర్వేలు పుట్టుకొచ్చాయి. వాలిడేషన్ ఆఫ్ షెడ్యూల్డ్ క్యాస్ట్, మ్యాపింగ్ మిస్సింగ్ సిటిజన్, జీరో టు సిక్స్ ఇయర్స్ చిల్డ్రన్ ఆధార్ ఎన్‌రోల్మెంట్, టాక్ ఈ కేవైసీ, కమ్యూనిటీ అసైడ్స్ జియో టాకింగ్, ఎన్‌పీసీఐ లింక్, ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్ జియో టాకింగ్, ఆధార్ స్పెషల్ క్యాంపెయిన్, ఇన్‌స్పెక్షన్ ఆఫ్ స్కూల్, టాయిలెట్స్ నాన్ ఏపీ రెసిడెన్స్, అప్డేట్ ఈకేవైసీ, అప్డేట్ మొబైల్ నంబర్, హౌస్ హోల్డ్ జియో టాకింగ్ లొకేషన్, ఆధార్ ఈకేవైసీ, పింఛన్ మొబైల్ నంబర్స్ అప్‌డేట్, డేటా అప్‌లోడ్ సర్వేలు కొనసాగుతున్నాయి. దీంతో పాటు అదనంగా ఇంటి పన్ను వసూళ్లు, స్వామిత్ర సర్వే, స్వర్ణ పంచాయత్, రీసర్వేలు, ఎన్‌సీడీ సర్వే, రైతు భరోసా కింద సర్వేలు, పింఛన్ల పంపిణీ సిబ్బందికి తలకు మించిన భారమవుతోంది. ఈ భారంతో సర్వేలు నత్తనడకన సాగుతున్నాయి. చాలా మంది ఓటీపీలు చెప్పడం లేదు. ఈకేవైసీలు చేయించుకోవడంలేదు. ఏం చేయడానికి ఈ సర్వేలంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

సిబ్బందికి సర్వే ఫీవర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ సిబ్బందికి సర్వే ఫీవర్ మొదలైంది. తెల్లారితే సర్వే అని మొదలుపెడితే సాయంత్రానికి సిబ్బంది సర్వర్ డౌన్‌పుతోంది. రాత్రి ఇంటికి వెళ్లే సరికి సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఆపై కూడా సొంత సేవలు పట్టి పీడిస్తున్నాయి. ప్రధానంగా పంచాయతీ కార్యదర్శులు సర్వేలు చేసుకుంటూ.. మీటింగ్‌లు చూసుకుంటూ.. ప్రారంభోత్సవాలు చేసుకుంటూ..గ్రామ సమస్యలను చూసుకోవాలంటే దిమ్మ తిరుగుతోంది. ఇక పలు శాఖలకు సంబంధించిన సిబ్బంది సైతం ఈ సర్వేల్లోనే నిమగ్నమైపోయారు. ఈ కారణంగా పశువైద్యం మూగబోయింది. మహిళా పోలీసులను ఇతరత్రా పనులకు, సర్వేలకు వాడుకోవడంతో ఈ వ్యవస్థ కనుమరుగవుతోంది. పల్లెల్లో సారా, గంజాయి, బెల్టు షాపులు జోరందుకుంటున్నాయి. కీలకంగా పనిచేయాల్సిన డిజిటల్ అసిస్టెంట్లు కూడా కాసేపు స్థిరంగా సీట్లో కూర్చోలేకపోతున్నారు. వారికి సైతం అదనపు పనులు అప్పగించడంతో ప్రజా సేవలు కుంటుపడుతున్నాయి. ఇదే మాదిరిగా అగ్రికల్చర్ అసిస్టెంట్లు కూడా పొలం బడిని వదిలేశారు. ఇక సిబ్బందిని వివిధ శాఖలకు సర్దుబాటు చేయాలనే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సర్వేపై అనుమానాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతోంది. ఇంత వరకూ సంక్షేమ పథకాల జాడ కనిపించడంలేదు. డిసెంబర్‌లో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటే సంక్రాంతికి కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తీరా అది కూడా లేదు. దీంతో ప్రభుత్వం చేస్తున్న సర్వేలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేదలకు ఇళ్ల మంజూరుతోపాటు సూపర్ సిక్స్ అమలులో కోతలు పెట్టేందుకు ఈ సర్వేలు చేస్తున్నట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అందుకే వలస వెళ్లిన వారి వివరాలను కూడా లోతుగా సర్వే చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఇక సచివాలయాలకు వెళితే సేవలు అందక అల్లాడిపోతున్నారు.

ఇటు కూటమి పోరు

ప్రస్తుతం సచివాలయ సిబ్బంది పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయపడ్డ అన్న చందంగా ఉంది. సర్వేలు, సొంత పనులు, సేవలు తలనొప్పిని తెచ్చిపెడుతుంటే.. ఇలాంటి తరుణంలో చాలాచోట్ల కూటమి నేతలు సిబ్బందిపై కత్తికడుతున్నారు. వాళ్లు..మాకు మర్యాద ఇవ్వడం లేదని క్షేత్రస్థాయిలోని చోటామోటా నాయకులు అధికారులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రధానంగా కూటమి నాయకుల వర్గపోరుకు బలవుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎవరు చెప్పినట్టు వినాలో తెలియక తికమకపడిపోతున్నారు. ఈ సవాలక్ష ఇబ్బందులతో పని వదిలి వెళ్లి పోదామనుకుంటే, కుటుంబాన్ని చూసి ఆగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొంత మంది బదిలీలు వస్తే ఎక్కడైనా మారుమూల ప్రాంతానికైనా వెళ్లిపోదామన్న ఆలోచనలో ఉన్నారు.


పెద్దిశెట్టిపల్లి సచివాలయం

నియోజకవర్గం	మండలం, పట్టణం	సచివాలయాలు	కుటుంబాలు
చిత్తూరు	చిత్తూరు రూరల్	9	9430
	చిత్తూరు అర్బన్	51	56526
	గుడిపాల	17	14,453
పూతలపట్టు	ఐరాల	19	17061
	బంగారుపాళ్యం	27	23812
	పూతలపట్టు	17	15068
	తవణంపల్లి	17	17831
	యాదమరి	18	15055

పది సార్లు తిరగాలి



ముందు ఏదైనా సమస్య, పని అంటే వలంటీర్లు ఇంటికాడికి వచ్చేవారు. మళ్లీ ఆ పనిచేసి పత్రాలు, కార్డులు ఇంకేమైనా ఉంటే కూడా ఇంటి కాడికే తెచ్చి ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఆ మాదిరిగా లేదు. మేమే సచివాలయం కాడికి వెళ్లాలి. పనంతా వదులుకొని కాసుకుని ఉండాలి. వాళ్లు వచ్చాక చూసి చేస్తారు. లేదంటే రేపు రండి అని చెప్పేస్తున్నారు. ఎప్పుడు చూసినా సర్వేలంటున్నారు. సర్వేలు అది..ఇది కాకుండా ప్రజలకు మంచి జరిగేలా..ఇబ్బంది లేకుండా సేవలు అందించాలి.

–లలిత, పచ్చనపల్లి, చిత్తూరు మండలం

నూతన బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని చిత్తూరు బార్ అసోసియేషన్(న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు కె.శంకరనాయుడు అన్నారు. చిత్తూరు నగరం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం నూతనంగా ఎన్నికైన న్యాయవాదుల సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షునిగా కె.శంకరనాయుడు, కార్యదర్శిగా సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షునిగా భూప్రసన్న, సంయుక్త కార్యదర్శిగా షఫీఉల్లా, కోశాధికారిగా ఎస్ ఆనంద్, స్పోర్ట్స్ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, లైబ్రరీ కార్యదర్శిగా రవిచంద్రన్, సాంస్కృతిక కార్యదర్శిగా రాజాచంద్రయాదవ్, కార్యవర్గ సభ్యులుగా చిన్నబ్బ, శరవణ, తులసీరామ్, రవికుమార్, అక్బర్ బాషా ప్రమాణం చేశారు. న్యాయవాదుల సంఘం సలహాదారులుగా వసంతకుమార్, రేణుకను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్‌ఆనంద్ యాదవ్, ఎన్నికల అధికారి వసంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్: టీచర్ల ఆర్థిక బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. చాలా కాలంగా టీచర్లకు బకాయిలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ పీఆర్‌సీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు రెహానా బేగం, రెడ్డెప్పనాయుడు, దీనావతి, ఎస్పీ బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సోమశేఖరనాయుడు

కోరం లేని మండల సమావేశం

పూతలపట్టు మండల మీట్ మమ అన్నట్లు ముగించారు. ఎంపీటీసీలు పూర్తిగా సభకు ముఖం చాటేశారు. ఇద్దరే ఇద్దరు హాజరయ్యారు. కోరం కోసం మండల అధికారులు కుస్తీ పట్టారు. కోరం లేకుండానే సభ జరిపించారు. ఆ తర్వాత కోరం ఉండాలని ఎంపీడీఓ పట్టుబట్టారు. సంతకమైనా వచ్చి పెట్టామని ఎంపీటీసీలను బతిమాలుకున్నారు.


సభకు హాజరైన అధికారులు, సిబ్బంది

పూతలపట్టు (కాణిపాకం): మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అట్టర్‌ఫ్లాప్ అయింది. సభ నిర్వహణను అధికారులు ముందస్తుగానే ప్రకటించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని ప్రకటనలో వెల్లడించారు. ఆ షెడ్యూల్ ప్రకారమే సభ ప్రారంభమైంది. మండల, గ్రామస్థాయి అధికారులు కొంత మంది మాత్రమే హాజరయ్యారు. అయినా సభ వేదికలోని కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే ఈసభ ఎంపీటీసీల హాజరుతో ముడిపడి ఉంది. వీరి బలం(కోరం) 1/3వంతు ఉండాలి. మండలంలో 12 మంది ఎంపీటీసీలుంటే ఎంపీపీతో పాటు నలుగురు ఎంపీటీసీలు హాజరు కావాలి. అప్పుడే ఆ సభ నిర్వహణకు కోరం ఉంటుంది. అందుకు తగ్గట్టు ఎంపీటీసీలు సభకు హాజరు కాలేదు. పూర్తిగా ముఖం చాటేశారు. కేవలం ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేకున్నా మండల అధికారులు సభను ప్రారంభించారు. మొక్కుబడిగా సభ నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఆపై కోరం లేదనే విషయాన్ని బయటక్కు పొక్కకుండా చేద్దామనుకున్నారు. కానీ అది బయటకు పొక్కేసింది. సభ పూర్తయిన తర్వాత ముగ్గురు ఎంపీటీసీలు వచ్చి కోరం లేకుండా ఎలా సభ నిర్వహిస్తారని ఎంపీడీఓను ప్రశ్నించారు. దీంతో ఆయన బిక్కమొహం పెట్టారు. అప్పటి నుంచి కోరం కోసం కుస్తీ పట్టారు. కొంత మంది ఎంపీటీసీలకు ఫోన్ చేసి సంతకం వచ్చి పెట్టి వెళ్లిపోవాలని చెప్పారు. అయినా వారు ససేమిరా అన్నారు. అయినా సభ కోరంను పట్టించుకోలేదు. దీనికితోడు కూటమి నేతలు సైతం అధికారులను కాపాడే ప్రయత్నం చేశారు.

మద్యం సేవించి బండి నడిపితే చర్యలు

చిత్తూరు అర్బన్: మద్యం సేవించి బండి నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు హెచ్చరించారు. మద్యం సేవించి, వాహనాలను నడుపుతూ శుక్రవారం పట్టుబడిన 13 మందికి రూ.10 వేల చొప్పున్న జరిమాన విధించామన్నారు. గత 12 నెలల వ్యవధిలో 690 మంది పట్టుబడగా రూ.69 లక్షలు జరిమానా విధించామన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే 185 సెక్షన్ కింద నేరమన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఆయన పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని యల్లంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో శీతాకాలంలో చిన్నారులు త్వరగా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. పిల్లలకు జబ్బు చేసిన వెంటనే వైద్యులను సంప్రదించడంతో చలికాలంలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు పాటుపడదాం

బంగారుపాళెం: స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన రాష్ట్రాన్ని పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రతి గ్రామంలో పరిసరాలను శుభ్రం చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను బాధ్యతగా భావించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా పెట్టుకున్నప్పుడే మన ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి స్వచ్ఛగ్రామాలుగా మార్చుచేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ లావణ్య, రీసర్వే డీటీ బాబు, ఆర్‌ఐ మధుసూదన్, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రేపటి నుంచి పశు ఆరోగ్య సదస్సులు

తవణంపల్లె: మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య సదస్సులు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. మండలంలో రెండు టీములుగా గ్రామాలకు వెళ్లి పశు ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఫస్ట్ టీం 20వ తేదీన పట్నం, టి.పుత్తూరు, 21న మైనగుండ్లపల్లె, మత్యం గ్రామాల్లో పశు ఆరోగ్య సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. 22న పుణ్యసముద్రం, జొన్నగురకల, 23న ఉత్తరబ్రాహ్మణపల్లె, పల్లెచెరువు, 24న తెల్లగుండ్లపల్లె, ఎగువ తవణంపల్లె, 25న దిగువ మోదలపల్లె, కర్ణంవాండ్లపూరు, 27న తవణంపల్లె, వీర్లగుడిపల్లె, 28న ఎగువ మారేడుపల్లె, ఎగువ తడకర, 29న కారకాంపల్లె, ముట్టుకూరు, 30న కొండ్రాజుకాలువ, రెండవ టీము 20న చారాల, నల్లపురెడ్డిపల్లె, 21న మాధవరం, మల్లకుంట గ్రామాల్లో పశు ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 22న జి. గొల్లపల్లె, సరకల్లు, 23న గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లె, 24న కట్టకిందపల్లె, ఎ.గొల్లపల్లెలో, 25న ఈచనేరి, వెంగంపల్లె గ్రామాల్లో, 26న తొడతర గ్రామాల్లో పశు ఆరోగ్య సదస్సులు జరుగుతాయని వివరించారు. పశుఆరోగ్య సదస్సులకు రైతులు సహకరించాలని కోరారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్షలు


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో శనివారం నవోదయ ప్రవేశపరీక్షలు సజావుగా నిర్వహించినట్లు డిపార్టుమెంట్ అధికారి, ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 231 మంది విద్యార్థులకు గాను 194 మంది హాజరయ్యారని చెప్పారు. 37 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను స్థానిక తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

స్వచ్ఛతా దివస్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం, ఏఆర్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. తర్వాత మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద, డీఎస్పీలు మహబూబ్‌బాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అడిషనల్ ఎస్పీ

యథేచ్ఛగా అక్రమ రవాణా


వసంతాపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కలప

గుడిపాల: కలప అక్రమ రవాణాకు అడ్డుఅదుపూ లేకుండా పోతుంది. పట్టపగలే ఎటుచూసినా ట్రాక్టర్ల ద్వారా రోడ్లపైన దూసుకుపోతోంది. రాత్రి వేళల్లో తమిళనాడు ప్రాంతానికి యథేచ్ఛగా తరలిస్తున్నారు. కలపను కొట్టి అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వృక్ష సంపద మాయమవుతోంది. మండలంలో ఎక్కువగా అటవీ ప్రాంతాలు ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతం కూడా తమిళనాడు సరిహద్దుకు ఆనుకొని ఉంది. కొంతమంది స్మగ్లర్లు ఇష్టానుసారంగా రాత్రివేళ అటవీ ప్రాంతంలోని పెద్దపెద్ద చెట్లను నరికివేస్తున్నారు. మరికొంత మంది రైతుల పొలాలు కొని వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న కలపను అంతా తమిళనాడుకు తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


ఏఎల్‌పురం వద్ద ట్రాక్టర్‌లో అక్రమంగా తమిళనాడుకు వెళ్తున్న కలప